# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-08-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **21వ శతాబ్దానికి అనుగుణంగా దేశంలో ఆధునిక క్రీడా వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

2. **నేపాల్ వరదల్లో చిక్కుకున్న రాష్ట్ర వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ అమలులో భాగంగా 2 వేల 447 కోట్ల 98 లక్షల రూపాయలను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.**

4. **పల్నాడు జిల్లా రోడ్డు ప్రమాద ఘటనలో ఏడుగురు మృతి చెందడం పట్ల గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో సహ పలువురు విచారం వ్యక్తం చేశారు.**

==========================

21వ శతాబ్దానికి అనుగుణంగా దేశంలో ఆధునిక క్రీడా వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్రీడా విశ్వవిద్యాలయాలు, ఆధునిక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తూ, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రతి దశలోనూ అవసరమైన సహకారం అందించే సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దృశ్యమాధ్యమ విధానంలో నిర్వహించిన 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈ ఉదయం ప్రసంగించారు. క్రీడలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే పరిమితం కాకుండా, దేశ నిర్మాణంలో క్రీడా ప్రతిభను, యువశక్తిని ఏకం చేసే మహత్తర లక్ష్యమని ప్రధాన మంత్రి పేర్కొంటూ..

వాయిస్....30 సెకన్లు

--------------------------

నేపాల్ వరదల్లో చిక్కుకున్న రాష్ట్ర వాసులను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, నేపాల్‌లో చిక్కుకున్న రాష్ట్ర వాసులు, వారి కుటుంబ సభ్యులు కంట్రోల్

రూమ్‌ను సంప్రదించవచ్చని సూచించారు. ఏపీ భవన్ కంట్రోల్ రూమ్‌లోని 011-23384016, 011-23387089 ఫోన్ నంబర్లలకు, వాట్సాప్ ద్వారా సంప్రదించడానికి 90598-24101 నంబరును వినియోగించాలని కోరారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, బాధిత యాత్రికులకు అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

---------------------------

పల్నాడు జిల్లా, చిలకలూరిపేట వద్ద ఈ తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీ కొంది. ప్రమాద సమయంలో ఆటలో 15 మంది ప్రయాణిస్తున్నారని పోలీసు అధికారులు వెల్లడించారు. మృతులు వేలూరు వాసులుగా గుర్తించారు. క్షతగాత్రులకు గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రమాదంపై ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఆధునిక హంగులతో రైతు బజార్ నిర్మాణ పనులకు విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. 5 ఎకరాల విస్తీర్ణంలో, అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులు 18 కోట్ల 55 లక్షల రూపాలయతో ఈ రైతుబజారును నిర్మించనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ ఇంటిగ్రేటెడ్ రైతుబజారును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

---------------------------

అక్టోబర్ నుంచి నూతన పింఛన్లు మంజూరు చేయనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గౌనివారి పల్లి నుంచి చెట్లమురంపల్లి వరకు 2 కోట్ల 50 లక్షల రూపాయలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులు, సీసీ డ్రైయిన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా డిఎస్సి నోటిఫికేషన్‌తో పాటు జాబ్ కాలెండర్ కూడా విడుదల చేస్తామని మంత్రి పేర్కొంటూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 2 వేల 447

కోట్ల 98 లక్షల రూపాయలను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మొత్తంలో కేంద్రం వాటా వెయ్యి 468 కోట్ల 79 లక్షల రూపాయలు కాగా, రాష్ట్రం వాటా 979 కోట్ల 19 లక్షల రూపాయలని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నిధులతో రాష్ట్రం ప్రాధాన్యతా క్రమంలో కార్యక్రమాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక వెయ్యి 175 కోట్ల 3 లక్షల రూపాయల నిధులు విడుదల చేసినట్లు సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

---------------------------

'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమంలో భాగంగా దృశ్యమాధ్యమ విధానంలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని తిరుపతి జిల్లాకు విద్యార్థులు ఆశక్తిగా తిలకించారు. తిరుపతి నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాళహస్తిలో బాలికల డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లాలో ఎన్‌సిసి ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులను ప్రధాన మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మల్లేశ్వరి ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళగిరిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. కరువు పరిస్థితులు, వర్షాభావం వంటి అంశాలపై ఇటీవల జరిగిన శాసన సభ సమావేశాల్లో క్షుణ్ణంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో మంచినీటి అవసరాలు తీర్చేందుకు, పంటలను కాపాడుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల్ని ప్రోత్సహిస్తున్నామని, రాయలసీమ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 13 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం సీఆర్డీఏ అథారిటీపై సమీక్ష నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో రాజధానిలోని ప్రభుత్వ భవనాలకు సంబంధించి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించడంతోపాటు, కొత్తగా చేపట్టాల్సిన పనులకు అమోదం తెలియజేయనున్నారు.

=====================